# కథా ఇలా



## అల్లూరి గౌరీలక్ష్మి

'వధువు కావలెను. ఎం.డి. చదివి, తండ్రి హాస్పటల్‌లో ప్రాక్టీస్ చేస్తున్న వర్మ అనే యువకునికి (28) టెన్త్ క్లాస్ చదివి, పాతిక సంవత్సరాల లోపు ఉన్న సంస్కారవతియైన యువతి కావలెను. కట్నం ప్రసక్తి లేదు'

ఆ ప్రకటన చదివారు డెబ్భైఏళ్ల రంగారావుగారు. క్రింద అడ్రస్ చదవగానే ఆయన మొహం వెలిగిపోయింది. అదే వీథిలో ఉన్న డాక్టర్ రాజు గారబ్బాయి వర్మకోసమే ఈ ప్రకటన. ఆయన ఆనందంగా లేచి భార్య దగ్గరకి వెళ్లి ప్రకటన వివరాలు చెప్పారు.

"ఇందులో మనకేమిటానందం?" అందావిడ నిర్లిప్తంగా వంట చేసుకుంటూ.

"మన శ్రీదేవిని చేసుకుంటారేమో ప్రయత్నిద్దామా?" అన్నారాయన నెమ్మదిగా.

ఆ మాట విని ఆవిడ పని ఆపేసింది. భర్తవైపు జాలిగా చూస్తూ అంది. "పదోక్లాసు ఫస్టున దాటిన మన బంగారు తల్లిని చదివించే శక్తిలేక అంత తెలివిగల పిల్లనీ చదువు మానిపించాం. అది కుట్టుపని నేర్చుకుని నలుగురికీ బట్టలు కుట్టే అదో వ్యాపకంగా, మనకూ వేన్నీళ్లకు చన్నీళ్లుగా సాయు పడుతోంది! లక్షాధికారి ఆ రాజుగారెక్కడ? మనమెక్కడ? అసలు వాళ్ల వాకిట్లోకి

అడుగుపెట్టగల శక్తి మనకుందంటారా? మీ పిచ్చి గానీ!"

"నువ్వనేవన్నీ నిజమే కానీ, ఆ ప్రకటనలో కట్నం వద్దన్నారు. బెస్ట్ క్లాస్ చాలన్నారు కదే!"

"ఏదో మాటవరసకంటారు. నిజంగా చేసుకుంటారా? వచ్చిన సంబంధాలన్నీ పరిశీలించి బాగా కట్నం ఇచ్చేవాళ్లని ఎన్నుకుంటారు. ఇలా ప్రకటిస్తే ఎక్కువ సంబంధాలొస్తాయని ఆశ కాబోలు!" అంది రమణమ్మగారు నిట్టూరుస్తూ.

"పోనీ, ఓ ప్రయత్నం చేసి చూస్తే ఏం పోయింది? నష్టం లేదుగా! మీద పడి కొట్టరు కదా!" అన్నారాయన ఉక్రోషంగా.

"సరే, అలాగే కానివ్వండి! మీ మాటెందుకు కాదనాలి? అయినా, ఏ పుట్టలో ఏ పాముందో... ఉండండి, ఈ రోజు మంచిదో కాదో చూస్తాను!" అంటూ కళ్లజోడు పెట్టుకుని కాలెండర్ చూసింది.

"రేపు మంచి రోజండీ!" అందావిడ భర్తవైపు తృప్తిగా చూస్తూ.

మర్నాడే తన మనవరాలి వివరాలన్నీ వ్రాసి ఫొటో జతచేసి రాజుగారికి ఉత్తరం రాశారు రంగారావుగారు.

వారం తిరిగేసరికల్లా జవాబొచ్చింది. "మీ అమ్మాయిని చూడడానికి రావాలనుకుంటున్నాము. మీరు మా వీధిలోనే ఉన్నారు కాబట్టి ఈ క్రింది ఫోన్ నంబరుకు ఫోన్ చేస్తే వివరాలు మాట్లాడుకుందాం!" అని.

ఆ ఉత్తరం చదివి ఎంతో ఆనందపడిపోయారు రంగారావుగారు. భార్యకి చూపించారు. ఆవిడ ఒకటికి నాలుగుసార్లు చదివింది.

అప్పుడే వచ్చిన మనవరాలు శ్రీదేవికి ఈ విషయమంతా ఇద్దరూ పక్కన కూర్చోబెట్టుకుని ముచ్చటగా చెప్పారు. శ్రీదేవి వాళ్లిద్దర్నీ చిన్నపిల్లల్ని చూసినట్టు చూసింది. "ముసలాళ్లిద్దరికీ ఆశ చాలా ఉందే! అయినా నన్నడక్కుండా ఇంత చేస్తారా? నేనింకా చదువుకోవాలని చెప్పట్లేదా!" అంది చిరుకోపంతో.

"చదువుకోమ్మా... ఎవరొద్దన్నారు? నీ చదువుకు పెళ్లి ఆటంకం కాదు. అసలు నువ్వే ముందుగా ఆ రాజుగారి ఆస్పత్రికి వెళ్లి ఆ అబ్బాయిని చూసి మాట్లాడి, అతనెలాంటివాడో తెలుసుకుని రా! నీకు నచ్చితేనే ముందుకు వెళ్దాం. లేదంటే లేదు. నీ ఇష్టం!" రంగారావుగారు మనవరాల్ని బుజ్జగించారు.

శ్రీదేవి ఆలోచించింది. 'ఉట్టికెగరలేనమ్మ స్వర్గానికెగిరిందన్న' సామెతగా ఉంది వీళ్ల గొడవ అని నవ్వుకుంది. అంత ధనవంతులు, విద్యావంతులు తనని పెళ్లిచేసుకోవడం అనేది వట్టి మాట. అవన్నీ పక్కకి పెట్టి సరదాగా ఆ వర్మని ఒకసారి చూసి వద్దాం. నష్టమేమిటి? అనుకుంది.

హాస్పటల్‌కి బయలుదేరింది ఆ సాయంత్రం శ్రీదేవి. డాక్టర్ వర్మ లోపల ఔట్ పేషెంట్లను చూస్తున్నాడు. బాగానే ఉంది రష్. ఫీజు కట్టి కార్డు కొనుక్కుంది. తనవంతు వచ్చేవరకూ ఓపిగ్గా కూర్చుంది. తన పేరు పిలవగానే లోపలకు వెళ్లింది. ఆమె అంచనాకు విరుద్ధంగా వర్మ చక్కగా, అందంగా ఉన్నాడు. 'చాలా పొగరుబోతు అయి ఉండచ్చు. ఏదన్నా వెటకారం చెయ్యడు కదా?' అని కాస్త భయపడింది.

"చెప్పండి, ఏమిటీ ప్రాబ్లెం?" అన్నాడు ఆదరంగా.

"ఈమధ్య చాలా నీరసంగా ఉంటోంది. కాళ్లూ చేతులూ లాగుతున్నాయి!" అంది కాస్త నీరసం నటిస్తూ.

వర్మ పల్స్ చూశాడు. "ఏం చేస్తూంటారు?" అని అడిగాడు.

"టైలరింగ్ చేస్తానండీ!" అంది గొంతులో కాస్త వీక్నెస్ చూపిస్తూ.

"ఎక్కువ స్ట్రెయిన్ అవుతూంటారా?" అడిగాడు.

"అబ్బే, లేదండీ!" అంది మర్యాదగా.

ఆరోగ్యంతో మిసమిసలాడుతున్న ఆమెను చూస్తూ, "మరీ మీరు చెప్పినంత వీక్‌గా ఏమీ లేరండీ! బాగానే ఉన్నారు. వేళకి తింటూ ఉండండి చాలు. ఏం ప్రాబ్లెం లేదు!" అన్నాడు వర్మ.

"మరి మందులేమీ రాసివ్వరా?" అమాయకంగా కళ్లార్పుతూ అడిగింది.

"అవసరం అయినప్పుడే మందులు వాడాలి!" అన్నాడతను కాస్త హాస్యం కలగలిపి ఆమెవైపు చూస్తూ.

"వస్తానండీ, థాంక్స్!" లేచి నిలబడిందామె.

"మీలాంటి అందమైన అమ్మాయిలు హాస్పటల్‌కు రావద్దని కోరుకుంటాను!" అన్నాడతను. శ్రీదేవి సిగ్గుపడిపోయింది. 'నేను ఉత్తుత్తిగా వచ్చానని కనిపెట్టాడో ఏమో. ఖర్మ!' అనుకుంటూ ఇంటికి పరుగుతీసింది.


"నరుకున్నవాడే అమ్మమ్మా! నాకే రోగం లేదని బానే కనిపెట్టాడు. ఏవో బిళ్లలూ, టానిక్కులూ రాసిచ్చేస్తాడనుకున్నాను!" అంది అమ్మమ్మ పక్కన కూర్చుంటూ.

"ఇంకా నయం, బ్లడ్ టెస్టూ అవీ రాసిచ్చాడు కాదు!" అంటూ రంగారావుగారు నవ్వారు.

"ఇలా అడుక్కోవడానికి సిగ్గుగా లేదూ...దుక్కలా ఉన్నావు?" కోపంగా అడిగాడు గోవిందం ముష్టివాణ్ని.
"మీరు ఎప్పుడన్నా అడుక్కున్నారా?"
"లేదు."
"మరేంటి...ఏదో పెద్ద అనుభవం ఉన్నవాడిలా చెబుతున్నారు?"

కలపర్తి సత్యం, ఏలూరు





"ఫలానా రోజు మంచిది, కనుక రావాల్సింది!" అంటూ రాజుగారికి ఫోన్‌చేసి చెప్పారు రంగారావుగారు.

చెప్పినట్టుగానే రాజుగారు భార్య శాంతమ్మగారిని, కొడుకు వర్మనీ తీసుకుని కారు దిగారు. రంగారావు దంపతులు వారిని సాదరంగా ఆహ్వానించి తాముండే రెండు గదుల వాటాలోకి తీసుకువచ్చారు.

ముందు గదిలో నిలబడి ఉన్న శ్రీదేవిని చూసి వర్మ భ్రుకుటి ముడివడింది. కొన్ని సెకన్ల తర్వాత గుర్తొచ్చి ఆశ్చర్యంగా చూశాడు. చిన్నగా నవ్వి, అతనికి అర్థమయ్యేలా తలూపిందామె.

వర్మ సంభ్రమంగా నవ్వి కూర్చున్నాడు. 'గట్టిదానివే' అన్నట్టు చిన్నగా తల పంకించాడు. శ్రీదేవి సిగ్గుపడి లోపలికి వెళ్లి కొంతసేపటికి కాఫీ, ఫలహారాలు తీసుకువచ్చి ఎదురుగా కుర్చీలో కూర్చుంది తల వంచుకుని.

"మీరిద్దరూ కావాలంటే మాట్లాడుకోండి, వర్మా!" అన్నారు కొడుకుతో.

"ఈ పక్క గ్రిల్‌లో కూర్చోవచ్చండీ!" అంటూ రంగారావుగారు శ్రీదేవినీ, వర్మనీ తీసుకువెళ్లారు.

రంగారావుగారు రాజుగారితోనూ, రమణమ్మగారు శాంతమ్మగారితోనూ కబుర్లలో పడ్డారు. పుట్టుపూర్వోత్తరాల గురించి మాట్లాడుకున్నారు. అంతా ఒకే జిల్లావారని తెలిసి ఆనందపడ్డారు.

"మనం ఒకే వీధిలో ఉన్నా మిమ్మల్నెప్పుడూ చూడలేదు!" అన్నారు రాజుగారు.

"నేను సంగీతం మాస్టారిగా బతుకు వెళ్లబుచ్చాను. నా ఒక్కగానొక్క కూతురూ, అల్లుడూ ప్రమాదంలో మరణిస్తే ఈ పిల్లని పెంచుకొచ్చాం రాజుగారూ! ఈమధ్యనే ఈ వీధిలోకి అద్దెకి వచ్చాం. అందుకే మా గురించి మీకు తెలియదు. మీరు మాకు తెలుసు, బాబూ!" అన్నారు రంగారావుగారు.

"అయ్యో! ఎంతో కష్టపడి మనవరాల్ని ఇంతదాన్ని చేశారు, పాపం, కూతురూ, అల్లుడూ పోవడం ఎంత బాధ!" శాంతమ్మగారి మనసు ద్రవించిపోయింది. రాజుగారు కూడా బాధపడ్డారు.

ఇంతలో వర్మ, శ్రీదేవి వచ్చి కూర్చున్నారు.

"చెప్పండి, మీ రిద్దరూ సరే అంటే ముహూర్తాలు పెట్టుకుంటాము!" అన్నారు రాజుగారు ఇద్దర్నీ ముచ్చటగా చూస్తూ.

శ్రీదేవి సిగ్గుపడి లోపలకి వెళ్లిపోయింది. వర్మ వెళ్లి తల్లి పక్కన కూర్చున్నాడు. రమణమ్మగారు మళ్లీ కాఫీ చెయ్యడానికి లోపలికి వెళ్లింది.

"పురోహితుణ్ణి పిలుద్దాం రంగారావుగారూ! ఏమంటారు?" అన్నారు రాజుగారు సంతృప్తిగా.

రంగారావుగారు ఆనందంతో మూగబోయారు. గొంతు పెగుల్చుకుంటూ, "రాజుగారూ! పేపరు ప్రకటన చదివి మేం అత్యాశ అనుకుంటూనే వివరాలు పంపాం. అసలు సమాధానం వస్తుందనుకోలేదు. మీరు ఇలా రావడం, అమ్మాయిని చూసి ఒప్పుకోవడం నాకు కలలా ఉంది. నిజమని నమ్మలేకపోతున్నాను. మీలాంటి పుణ్యపురుషులు ఈ భూమ్మీద ఇంకా ఉండబట్టే..."

కృతజ్ఞతతో రంగారావుగారి గొంతు వణికింది.

రాజుగారు వెంటనే లేచి ఆయన పక్కన కూర్చుని చెయ్యి పట్టుకుంటూ, "పెద్దవారు మీరు. నాకు తండ్రిలాంటివారు. ఇలా పొగడరాదు!" అన్నారు మందలింపుగా.

ఇంతలో రమణమ్మగారు అందరికీ కాఫీ తీసుకువచ్చారు. అది తాగుతూ, "మీ కాఫీ మా అమ్మను గుర్తు చేస్తోందమ్మా!" రమణమ్మగారివైపు చూస్తూ అన్నారు రాజుగారు.

"ఎంత మాట బాబూ!" రమణమ్మగారి గొంతులో వాత్సల్యం పొంగింది.

"ఒక్క షరతు మీద మాత్రమే ఈ పెళ్లికంగీకరిస్తున్నాను!" అన్న రాజుగారి మాటకి అందరూ ప్రశ్నార్థకంగా చూశారు.

"చెప్పు, బాబూ!" అన్నారు రంగారావుగారు ఆప్యాయంగా.

"ఇరుపక్కల ఖర్చూ నాదే! మీ రొక్క పైసా కూడా ఖర్చు చెయ్యకూడదు. ఇదీ నా షరతు!" అన్నారు రాజుగారు.

అప్రయత్నంగా రంగారావు దంపతులిద్దరూ చేతులు జోడించారు మాటలు కరువయి.

"తప్పు. మేం మీకు నమస్కరించాలి!" అంటూ లేచారు శాంతమ్మగారు. రాజుగారు, వర్మ కూడా లేచారు.

వాళ్ల ముగ్గుర్నీ గేటు వరకూ సాగనంపారు రంగారావు దంపతులు.

శ్రీదేవి కూడా వారి పక్కనే ఉంది చిరునవ్వుతో.

***

అమ్మాయి కాంతి ఎప్పుడో లేచేది. ఈవేళ ఇంకా లేవలేదేం? అని కూతుర్ని లేపడానికి ఆమె పడుకున్న చోటికి వెళ్లాడు కోదండరావు.

పక్క టేబుల్ మీద కాగితాల బొత్తిపై అతని దృష్టి పడింది. అది చేతిలోకి తీసుకున్నాడు. 'బహుశా ఏదో కథలాగుందే, రాత్రి పొద్దుపోయే వరకూ ఇది రాస్తూ కూర్చున్నట్లుంది. అందుకే లేవలేకపోతోంది' అని ఆ కాగితాలు ఇవతలికి తెచ్చి పై కథ చదివాడు కోదండరావు.

'ఎంత తియ్యని కల కన్నావు, చిట్టితల్లీ! అవును, యోగ్యుడైన వరుడు కట్న కానుకలక్కర్లేదనీ, నాకు అమ్మాయే ముఖ్యం అనీ వస్తే బాగానే ఉండును. కోడల్ని కూతురితో సమానంగా చూసుకునే అత్త, అత్తను తల్లిలా చూసుకునే కోడలూ ఉంటే బాగానే ఉండును. ఇరుగుపొరుగులు సఖ్యంగా ఉంటే బాగానే ఉండును. కులాలూ, మతాల పేరిట కొట్లాటలు జరగకుండా ఉంటే బాగానే ఉండును. అవును, కలలు నిజమైతే బాగానే ఉండును. కానీ ఇది లోకమమ్మా, చిట్టితల్లీ! ఇలా కలలో తప్ప ఇలలో జరగదుగాక జరగదు...' అని పెదవి విరిచి నిట్టూర్పు విడిచాడు కోదండరావు.

ఆయన అప్పటికి తన కూతురు కాంతికోసం పదిహేను సంబంధాలు చూశాడు. వాటిలో ఏ ఒక్కటీ షరతులు లేకుండా లేదు. అవి ఎలాంటి షరతులనీ! ఆమె పెళ్లిమీద ఆశలు లేకుండా చేయగలిగిన షరతులు. మరీ తనకూతురి కలలోలా కాకున్నా, వాటిలో సగం షరతులు తగ్గినా చాలు తనకు.. ప్చ్... వర్మలాంటి వరునికోసంకూడా చూడ్డం లేదు మరి!

■

